# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలువురు కేంద్ర మంత్రులతో ఈరోజు సమావేశమవుతారు.**

2. **తెలంగాణలోని సింగరేణి సంస్థ ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 68శాతం పూర్తయిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్ష, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్యలు తీసుకుకోవాలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు కోరారు.**

4. **దేశవ్యాప్తంగా 'జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని' ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కలవనున్నారు. ఈ ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలలో పాల్గొంటారు. కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌లతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, వివిధ పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై కేంద్ర మంత్రులతో చర్చిస్తారు. అనంతరం అమరావతికి తిరుగుప్రయాణం అవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై అమరావతి సచివాలయంలో డీజీపీ, జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, తీవ్ర నేరాల కట్టడి విషయంలో జిల్లాలు ఇంకా మెరుగైన పనితీరు కనబర్చాలన్నారు. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హనానికి పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచిస్తూ,

వాయిస్ 32 సెకన్లు

--------------------------

తెలంగాణలోని సింగరేణి సంస్థ ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఇంకా చేరుకోలేదని, ప్రస్తుతానికి 68శాతం పూర్తయిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోగా జనవరి 31 నాటికి 48.88 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. భూగర్భ గనులన్నింటినీ పూర్తిగాను, పాక్షికంగాను యాంత్రీకరించినట్లు వెల్లడించారు. బొగ్గు మైనింగ్ బ్లాక్‌లకోసం కొత్త భూముల సేకరణకు ఎటువంటి ప్రతిపాదనలు కేంద్ర బొగ్గుశాఖకు రాలేదని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అంతరిక్ష, రక్షణ రంగ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుపై చర్యలు తీసుకుకోవాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌న ఆంధ్రప్రదేశ్ కు చెందిన పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు కోరారు. ఈ మేరకు పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రిని కలిసి నిన్న వినతిపత్రం సమర్పించారు. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, దొనకొండ వద్ద ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, నెల్లూరులో అల్యూమినియం ప్లాంట్, అధునాతన మధ్యస్థాయి యుద్ధ విమానాల తయారీ కేంద్రాలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం సమీపంలో నావికా పరికరాలు, ఆయుధాల పరీక్ష సౌకర్యాలు కల్పించాలని , రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గుర్తించిన తయారీ కేంద్రాలలో రక్షణ రంగ కారిడార్లు ఏర్పాటు చేయాలని కోరారు.

---------------------------

సత్వర న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ సి హెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. అమరావతిలోని హైకోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వంపై నిర్వహించిన 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేగంగా న్యాయం పొందడం ప్రజల హక్కు అని, మధ్యవర్తిత్వం విధానాన్ని అనుసరించి కేసులను పరిష్కరించుకుంటే ఇరుపక్షాల కక్షిదారులకు సంతృప్తికరమైన ఉపశమనం లభిస్తుందని చెప్పారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోని, కేసుల పరిష్కార దిశగా అడుగులు వేయాలని న్యాయవాదులను కోరారు.

---------------------------

వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం -CISF ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైక్లోథాన్ 2026 ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లా చీరాలలోని రామాపురంకు నిన్న చేరుకుంది. ఈసందర్భంగా చీరాల శాసన సభ్యులు కొండయ్య వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తీర ప్రాంత ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై , దేశ రక్షణకు సంబంధించిన అంశాలను వివరిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని తెలిపారు.

వాయిస్ 25సెకన్లు

---------------------------

'జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని' దేశవ్యాప్తంగా ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 10, ఆగస్టు 10న రెండు సార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా ఒకటి నుండి 19

సంవత్సరాల వయసుగల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నారు. పిల్లలలో పోషకాహార లోపం, రక్తహీనతను నివారించడానికి, నులిపురుగుల సమస్య నివారించే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైద్య ఆరోగ్య శాఖలు ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మాత్రల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేశాయి.

-----------------------------

మేఘాలయకు చెందిన జాతీయ ఆరోగ్య మిషన్ అధికారుల బృందం ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఎనీమియా ముక్త్ భారత్ అమలులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పాటిస్తున్న విధానాలను పరిశీలించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం నిన్న సందర్శించింది.ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా పథకాల అమలు పర్యవేక్షణ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎనీమియా కింద గర్భిణులు, బాలింతలు, బాలికలు, విద్యార్థుల్లోని రక్త హీనతను తగ్గించేందుకు అందచేస్తున్న ఔషదాలు, మందుల పంపిణీ వంటి చర్యల గురించి ఈ బృందం అడిగి తెలుసుకుంది. ఈరోజు అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించనుంది.

-----------------------------

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ప్రచార గడువు నిన్న సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 12 వేల 930 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తం 8 వేల 203 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది.

-----------------------------

అంతరిక్షంలో భారత్ స్పేస్‌స్టేషన్ నిర్మాణం దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ – ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత జాతీయ మహాసముద్ర సమాచార వ్యవస్థల కేంద్రం–ఇన్‌కాయిస్ 27వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర సమాచార సేవలపై ఇన్‌కాయిస్ అభివృద్ధి చేసిన జెల్లీ ఏఐపీ, సముద్ర 2.0, శివాస్ యాప్‌లను ప్రారంభించారు. అనంతరం నారాయణన్ మాట్లాడుతూ, భారత ఉపగ్రహాల సంఖ్యను వచ్చే మూడు, నాలుగేళ్లలో మూడు రెట్లకు పెంచనున్నామని వెల్లడించారు. సునామీ, తుపాను హెచ్చరికలు, సముద్ర స్థితి అంచనాలు, సముద్రంలో చేపల లభ్యత ప్రదేశాలు, వాతావరణ మార్పుల గురించి ఇన్‌కాయిస్ విలువైన సమాచారాన్ని అందిస్తోందని వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత క్రమంగా తగ్గుతుండగా.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయవ్య ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, దీంతో తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని పేర్కొంది.

======================